# మమకారం..!!

రచన : శ్రీమతి పరానేని శ్రీశైల భ్రమరాంభా

ఆరు నెలలైంది. కమలను చూచి అప్పుడే సీతమ్మగారికి వయస్సులో దిగులుగా, చాలా ఆత్రుతగాయుంది. కమలను చూడాలని - తానెక్కడికీ ఒంటరిగా ప్రయాణం చెయ్యలేదని కమలకి తెలుసు. అయిదు నెలలనుంచీ ఉత్తరం ముక్కకూడా వ్రాయలేదు. పెళ్ళి అయిన ఏడాదికే కమల ఇల్లా మారిపోయిందే ఇంక బిడ్డల తల్లి అయితే! ?

సీతమ్మకి కళ్ళనీళ్ళు వస్తున్నాయి. అసలు కమలకి పెండ్లి అయినప్పటినుంచే మారిపోయినట్లు తాను అనుకొంటూనే యుంది. పెళ్ళయ్యాన శలవులకి కమల భర్త మూర్తి గారింటికి వెడ్తే, కమల తన యింటికి వచ్చింది. సంక్రాంతిశలవులు నెల్లాళ్ళూ సీతమ్మదగ్గర ఉందన్నమాటేగాని ఎప్పుడూ భర్తమీద ధ్యానంతోనే గడిపేది. తనలో తను ఆనందంలోకాల్లో తేలిపోతూన్నట్లు. మాటిమాటికీ తన భర్తని గుర్తుకు తెద్చుకు నవ్వుతూ యుండడమే కాని ఒక్కసారైనా సీతమ్మతో మనసిచ్చి మాట్లాడలేదు. లోకంలో తానూ తన భర్త తప్ప ఇతరవ్యక్తులు లేనట్లు ఎప్పుడూ మూర్తిని గురించే చెప్పేది. ఎన్నోసార్లు చెప్పిందే మళ్ళీ మళ్ళీ విసుగు లేకుండా చెప్పుతూండేది. కమల మూర్తిని గురించి మాట్లాడేటప్పుడు వికశించిన పద్మంలా మెరిసిపోతూ, మహా ఉత్సాహంతో చిరునవ్వుతోయుండేది కమల ముఖం.

అయిదు నెలలనుంచీ ఒక్క కార్డు ముక్క వ్రాయడంకూడా మర్చిపోయిందా? ఏరోజుకారోజే కమల దగ్గరనుంచి జాబు వస్తుందని ఎదురుచూడ్డం, పోష్టుమేన్ వెళ్ళిపోయేవరకూ గుమ్మంలో నిరీక్షించి "ఉత్తరంలేదు" అనడంతో నిరాశపడి దిగులుగా ఇంట్లోకి వెళ్ళిపోతోంది సీతమ్మ. ఈ అయిదు నెలలనుంచీ ఇది ఒకదిన చర్యలాయుంది ఆవిడకి.

తనుమాత్రం కమలకి ప్రతివారం ఉత్తరం వ్రాస్తూంది. ఆఖరికి వెలున్నను రిప్లై కార్డు కూడా వ్రాయించింది. నిన్నను టెలిగ్రాంకూడా యిచ్చించింది. తెల్లవారితే తన కమలకి పుట్టినరోజు. ఇరవైనాల్గుఏళ్లు పూర్తవుతాయి. పుట్టినరోజుకు తలంటినీళ్లుపోసి క్రొత్త చీర కట్టుకోమనాలని తనెంతో మనసుపడి కమలకి ఎంతో ఇష్టమైన కేతనీలం చుట్టూ బాతుల అంచు బెంగుళూరు సిల్కుచీర అరవైరూపాయలకు కొని పెట్టెలో దాచింది. కమలకు కనీసం తన పుట్టినరోజు అనే సంగతి కూడా గుర్తు లేకపోయిందా? తనకు ఒక్క జాబు వ్రాయడానికి కూడా ఎందుకింత నిర్లక్ష్యం చేస్తోంది? ఒకవేళ కమలకి ఒంట్లో ఏమైనా సుస్తీగా యుందా?... పోనీ అనారోగ్యంగా యుంటే కమల భర్త వ్రాయొచ్చునుగా? కమలకి బాగా జబ్బు ఏదైనా చేసిందా?...

సీతమ్మ యిల్లా ఆలోచించుకొంటూంటె కళ్లనీళ్లు గిర్రున తిరిగాయి. కళ్లు తుడుచుకు నెమ్మదిగా మంచం మీద పడుకుంది ఒక్కసారి కమల డిగ్రీ పుచ్చుకు తీయించుకొన్న ఫోటోతీసి దగ్గరపెట్టుకుని కమలని తనివి తీరా చూసుకొంటూ కూర్చుంది సీతమ్మ.

నిన్న రాత్రి కమలమీద కలకూడా వచ్చింది బాధపడ్తోంది మనస్సులో. వంటకూడా చేసుకోవాలని బుద్ధి పుట్టడంలేదు సీతమ్మకి. తన చేతుల్లో పెరిగిన కమల తన కన్న కూతురుకన్నా ఎక్కువగా చూచుకున్న కమల ఎల్లా మారిపోయింది? తనతో తన కమలకి ఇంకేం పనుంది? వయస్సులో, విద్యలో, ధనంలో, దేనిలోనూ కమలకు తాను సరితూగదు. చిన్నపిల్లయినా కమల కష్టపడి చదువుకుని, డిగ్రీ పుచ్చుకు ఉద్యోగంలోకి వెళ్ళాక పెళ్ళాడి రెక్కలొచ్చి తన భర్తతో సహా ప్రపంచంలోకి బ్రతకడానికి ఎగిరిపోయింది. తానూ తన వయస్సూ, వివేకం బాగా తెల్సుకుని తాను పడియుండాలే కాని, కమల తన చెప్పుచేతల్లో యుండలేదనుకోవడం శుద్ధ వెర్రితనం కాదా?

*Our SERVICE to the NATION*

*Thro' Agriculturists & Industrialists !*

**INSIST ON GEECO MOTORS**

TRADE MARK



# GEECO MOTORS

are renowned for

GUARANTEE
ECONOMY
EFFICIENCY
CONSTRUCTION & OUTPUT

3 Phase Electric Motors upto 25 H. P. in 1,440, 960 and 2,880 H. P.
Fractional H. P. Motors upto 2 H P . in 1,440 R. P. M.

## CENTRIFUGAL PUMPS

Double Pulley pumps upto 6"
Direct coupled pumps upto 6"
Domestic Pumps—all Stsge upto 1½"




Also manufacturing single arm & double arm split pulleys for industrial uses

— AGENTS WANTED IN UNREPRESENTED AREAS —

*Manufacturers :*

## GENERAL ENGINEERING COMPANY

Patel Road. (Phone : 3611), COIMBATORE-9.
Branch : 316. Thambu Chetty Street, MADRAS-1.
(Approved by Madras, Kerala and Andhra Pradesh Governments).


కమల చిన్నతనంలో ఓసారి తల్లిదండ్రి నల్గురు పిల్లలు కల్సి సీతమ్మగారింటి కొచ్చారు. అప్పుడు కమల తండ్రి శాస్త్రి తనకు వచ్చే ముప్ఫయి రూపాయిల జీతంలో నల్గురు పిల్లలు తాము బ్రతకడం కష్టమై పోతోందని చెప్పడం, తన ఇంటికి వచ్చిన రోజునుంచీ కూడా కమల తనను పట్టుకు వదలకుండా తిరగడం, ఎన్నో కారణాలు కల్సిరావడంతో కమలను తన దగ్గర వుంచుకుంటానంది సీతమ్మ. ఎక్కడో ఓచోట బ్రతికి బాగుండి కడుపు నిండా అన్నం తింటే చాలునని తల్లీ కూడా కమలను వదలిపెట్టి వెళ్ళిపోయారు సీతమ్మ అడిగిందే తడువుగా..

తన వంటరితనం అంతా మర్చిపోయింది కమల పెంపకంతో. కమల మాత్రం తనని "అత్తయ్యగారూ" అని పిలిచేది మొదట్లో. కమల తండ్రి తనకు దూరపు బంధువు సోదరుడు వరసకావడం చేత. ఏదో గర్ల్సస్కూలు చదువుతో కమలకు చదువుకి స్వస్తిచెప్పించి పదివేలు కట్నంతో గొప్ప సంబంధం చూచి పెళ్ళి చెయ్యాలనుకొంది సీతమ్మ. కాని కమల ఇంకా చదువుకొంటానని సరదా పడ్డంతో హైస్కూల్లో చేర్పించి స్కూలు ఫైనలు వరకూ చదివించింది. అంతటితోనైనా చదువు చాలించమంటే; డిగ్రీ పుచ్చుకునేవరకూ చదువుకొన్నట్లయితే, కాని కట్నం ఇవ్వకుండా గొప్ప సంబంధం వస్తుంది.

కట్నంగా యివ్వదల్చుకున్న పదివేలూ నా చదువుకే ఖర్చుపెట్టమని చెప్పడంతో ఇంక సీతమ్మ ఏమీ అనలేక పోయింది. యం. ఎస్. సి. వరకూ కమలకు చదువు చెప్పించింది—

కమల అంత చదువుకొంటున్నా సరే పెళ్ళయ్యేవరకూ తన దగ్గరే పడుకునేది. పరీక్షలకి చదువుకొంటూంటే తనే సాయం కూర్చునేది. కమల మనసులోని ప్రతీ మాటా ప్రతీ రహస్య విషయం. అన్నీ తనకు చెప్పేది. అసలు కమల మనస్సులో ఏదైనా ఐడియా తట్టిందంటే చాలు. అది సీతమ్మతో చెప్పకపోతే క్షణం కూడా ఉండలేక పోయేది కమల. తను ఆడే ఆటల గురించే కాదు, తన ఫ్రెండ్సును గురించే కాదు, కాలేజీలో జరిగే ప్రతీ విషయాన్ని పూసగ్రుచ్చినట్లు చెప్తూండేది ఏరోజు కారోజు సీతమ్మతో. ఏ చిన్నమాట యున్నా చెప్పకపోతే తృప్తియుండేది కాదు కమలకి—

ఆటలు, పాటలు, గంతులు, అల్లరిగా అందర్నీ ఆకర్షించే కమల, ఆమె చిలిపి కళ్ళకి ఎవరు నచ్చుతారో; ఏ అబ్బాయిని ప్రేమించానంటుందో, ఏం చిక్కులు తెచ్చిపెడ్తుందోనని భయపడేది సీతమ్మ.

చివరకి సీతమ్మ ఎందుకైతే భయపడ్తోందో; అల్లాగే కమల పదిరోజులు మవునంగా యుండి ఓనాడు తాపీగా చెప్పేసింది. నేను ఫలానా అబ్బాయిని పెళ్ళాడ్తానని. ఆ మాటతో సీతమ్మకు చిర్రెత్తుకొచ్చింది. తను కంటికిరెప్పలా చూచుకునే తన కమల ఓ నీచుడికి,మూర్ఖుడికి భార్యగా యుండడం తగదని ఆమె మనస్సా తీర్మానించుకుని కమలతో నిక్కచ్చిగా చెప్పింది. ఆతన్ని చేసుకోవద్దని. తాను ప్రేమించినవాని లోపాలు తనకు ప్రత్యక్షంగా చూపిస్తే కాని నమ్మనంది కమల. తాను వానిని గురించి తెల్సుకున్న వివరాలన్నీ చెప్పింది కమలకు. ఇంకెవరైనా నీకు బాగా నచ్చిన వానినే నీకు పెళ్ళి చేస్తానని చెప్పింది సీతమ్మ—

ఇంత చెప్పినా కమల సీతమ్మకు తెలీకుండా ఆ యువకునితో షైర్లు, సినీమాలు, విలాసాలకు పోతూండేది. తాను సీతమ్మదగ్గరైతే దాచిపెట్టగల్గిందే కాని, చూచిన వాళ్ళందరి కళ్ళకూ గంతలు కట్టగలదా కమల మాత్రం? ఆ నోటా ఈనోటా సీతమ్మ చెవిని పడిందీ వార్త. పరువు మర్యాదలకు, నీతి నియమాలకు లోపము వస్తే మాత్రం సహించే రకం కాదు. సీతమ్మ—ఆ రోజు కమల సినీమాకెడ్తానని చెప్పి సీతమ్మని కూడా రమ్మంది. సీతమ్మ రానని చెప్పాక అరగంట ముందే కమల వెళ్ళింది. ఆ తర్వాత ఏమీతోచక ఇరుగు పొరుగు అందరితోనూ సీతమ్మ కూడా వెళ్ళింది. సరిగా సినీమా వదలి యింటికి పోయే సమయానికి కమల ఆతడు కల్సివెళ్ళడం సీతమ్మ స్వయంగా చూచింది. తాను ఇంటికి వచ్చి గంటకుగాని కమల ఇంటికి రాలేదు. ఇంత ఆలస్యమైందే ఇప్పుడే షష్టు షో వదిలారని దబాయించింది కమల—

"కమలా నువ్వు చేస్తోన్నది చాలా తప్పుపని. అది నాకు సుతరామూ ఇష్టం లేదు. నా యిష్టాఅయిష్టాలతో నిమిత్తం లేకుండా నువ్వు ఆతన్నే పెళ్ళాడ్తానంటావా? పో! నా ఇంట్లోంచి వెళ్లి ఆతనితోనే యుండు. నాకేం సంబంధం లేదు. నువ్వూ చదువుకున్నావు. ప్రాజ్ఞురాలవు స్వతంత్రంగా బ్రతక గల్గిన శక్తియుంది నీకు.


Regd: Trade Mark. ఫోన్ : 2217 : : తంతి: "డొవెటెక్స్"




No. 162919

డొవెటెక్స్ కంపెని

(ఉత్పత్తిదారులు, రవాణాదార్లు)

బెడ్ షీట్స్ - టవల్స్, మొదలైనవి.

చేనేత బట్టలు మరియు నూలు వ్యాపారస్తులు.

నెం. 14, మహాల్ 2వ వీధి, మధురై (S.I)

**SOVASS CHEMICAL WORKS**
MANUFACTURING PERFUMERS
FACTORY: TIRUVOTTIYUR

Phone: 33736
Distributors:
**VASU TRADING COMPANY**
116, NAINIAPPA NAICK STREET, MADRAS-3.

Branch Office:
7/8, MEENAKSHI KOIL STREET. MADURAI-1

కాని కమలా ఒక్కటి గుర్తుంచుకో". సినీమాల్లోలాగ నవల్సులోలాగా మనకి నిజమైన జీవితాలు మాత్రం అల్లా గడవని గ్రహించుకో. వెళ్ళు. నువ్వు ఎవ్వరితోనైతే స్వేచ్ఛగా బ్రతకదల్చుకున్నావో, వాళ్లదగ్గరకే వెళ్ళిపో. మానమర్యాదలు పోయాక మనిషి బ్రతికినా చచ్చినా వాళ్లతో లెక్క." అని సీతమ్మ ఎంతో కష్టంగా నిక్కచ్చిగా చెప్పేసింది—

"నువ్వనుకొన్నట్లుగా నేనేం అల్లా బరితెగించి ఎవ్వరితోనూ స్వేచ్ఛగా తిరగడం లేదు. తాను కోరే వస్తువును యితరులు దూషిస్తూంటే ఎవరికి కోపంరాదు?" కోపంతో ఎదిరించి జవాబిచ్చింది కమల—

"ఎప్పటి మాటో ఎందుకు? ఇవ్వాళ నువ్వు ఆతనితో కల్సి సినీమాకెళ్లి సినీమా వదిలాక గంటవరకూ ఆతనితో మాట్లాడి ఇబ్బాడా యింటికి రావడం?" తీవ్రంగా అడిగింది సీతమ్మ—

"నేను ఆతనితో కల్సి సినీమాకి వెళ్ళనూ లేదు. ఇప్పటివరకూ నాతో ఆతడు యుండనూలేదు. ఎవరో నన్ను గురించి అబద్ధాలు కల్పించి చెప్పి యుండొచ్చు నీకు" అంది కమల. ఇంక సీతమ్మ తనను దండిస్తుందనే భయంతో—

ఎప్పుడైతే కమల నోటంట అబద్ధం వచ్చిందో ఇంక సీతమ్మకి కోపంతో ఒళ్ళు దహించుకు పోయింది. ముందు వెనకా ఆలోచించకుండా ఫెడీ ఫెడీ నాల్గువేసింది చెంప మీద దానితో కమల మత్తు పూర్తిగా వదలిపోయింది. తిన్నగా గదిలోకి వెళ్లి క్రింద చాపేసుకుని బోర్లా పడుకుని ఏడుస్తూ బాధ పడ్తోంది—

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు సీతమ్మ కమలను కొట్టాక తనలో తనే పశ్చాత్తాపపడి చాలా బాధ పడింది మనస్సులో—కొంత సేపు అల్లాగే కమలనుగురించి ఆలోచించుకుంది. తన కమల తననికాదని నేటివరకూ ఏమాటాదాచలేదు. తన స్నేహితులందర్నీ నాకు పరిచయం చేసేది. కాని యీతణ్ణి ఎందుకు నాకు చూపించలేదు. కమల మనస్సుకి కష్టంకల్గే ఏపనీ నేనెన్నడూ చెయ్యమన్లేదే? ఇంతవరకూ కమలనోటంట ఎప్పుడూ అబద్ధంరాలేదే? ఈనాడెందుకు నాతో అబద్ధమాడాల్సి వచ్చింది? నెలరోజుల క్రితం వరకూ ఎన్నికబుర్లు చెప్పేది, నాకు నచ్చినదే పెళ్ళిచేసుకోననీ, నన్నే తవకు అన్నివిదాలా అనుకూలమైనవరుణ్ణి చూడమనీ చెప్పేదే? అల్లాంటి కమల ఈనాడిందుకిల్లా మారిపోతోంది. అయినా అన్నీ కమలనే బుజ్జగించి అడగాలని మెల్లిగా కమల దగ్గర కొచ్చింది. ఏడుస్తూన్న కమలను చూచేసరికి సీతమ్మగుండె కరిగిపోయింది.

"కమలా ఎందుకమ్మా అంత ఏడుస్తావే? నేనూ నువ్వు వెళ్ళాక సినీమాకొచ్చా. నాకళ్లతో నేను స్వయంగా చూశాకాబట్టే నిన్ను దండించాల్సిన బాధ్యత నాకుందని అడిగా—కాని నువ్వు అబద్ధం చెప్పండంతో నాకు చిర్రెత్తుకొచ్చింది. నాతో నీకు అబద్ధం చెప్పవల్సినపనేమొచ్చింది? నే నెప్పుడైనా నీ

మాట కాదన్నానా? నీతోకల్సి యీనాడు నిన్ను ప్రేమిస్తున్నానని డబ్బాలు కొట్టే అతడు మంచివాడు మాత్రంకాదు. నేను అతన్ని పూర్తిగా ఎరుగుదును'' అంది కొంచెం కఠినంగా సీతమ్మ.

“నీకు మహా తెల్సినట్లు చెప్పుతున్నావు'' అంటూ ఉక్రోషంతో అంది కమల.

“అల్లాగైతే రేపు అతన్ని మనింటికి తీసుకురానే నే ఆతని ఎదుట చెప్తా'' అంది సీతమ్మ.

“ఆతడంత ఏం పిరికి వాడుకాడు. అల్లాగే రమ్మంటానే'' అంది కొంచెం కటువుగా.

మర్నాడు ప్రొద్దున్నే అతన్ని తీసుకునస్తానని బయలేరి వెళ్ళింది కమల. అంతా ఆతనితో చెప్పింది. సీతమ్మ దగ్గరకు రమ్మంది. అతడు ససేమిరా.ఒప్పుకోలేదు సీతమ్మ ఎదుటికి రావడానికి ముఖం చెల్లాదేసుకు ఇంటికి వచ్చేసింది కమల.

“అతడేడమ్మా! ఇక్కడకు రానన్నాడు కదూ? ఆతడు నా కంఠంలో ప్రాణముండగా ఇక్కడకు ధైర్యంగా రాలేడు. వెర్రి తల్లీ! నీకులోకం అంటే ఏమిటో తెలియదు. పువ్వుచుట్టూతుమ్మెదలు చేరడం సహజం_అల్లాగే నీచుట్టూ ఈగల్లాముసరడానికి ప్రయత్నిస్తారు. అందితే అనుభవించడానికి లేకపోతే చెదిరిపోతారు. తీరా నన్ను పెళ్ళాడ్తావా? అని నువ్వే సాహసించి అడిగేసరికి బెదిరిపోతారు.

కమలా! ఆతడు పరమతుంటరి. వేశ్యాలోలుడు. నీచుడు. అట్టివాడు నీకు తగదమ్మా! నువ్వు హాయిగా నీకు నచ్చిన వాణ్ణి పెళ్ళాడ్తానంటే నేనెన్నడూ అభ్యంతరపెట్టను. నీ ఆనందం, నీ సుఖమే నేనెల్లప్పుడూ కోరుకొంటూ _ జాతికోసంకూడా నేను శంకించను తల్లి నిజాయితీగల మానవుడెవ్వరైనా సరే నీయిష్టమొచ్చిన వానిని చేసుకోవచ్చు. స్వజాతివానినే చేసుకొంటావా? నే నెప్పుడైనా నీయింటికి వచ్చే అవకాశంయుంటుంది. మీ అమ్మనాన్నా అందరూ సంతోషిస్తారు. అల్లాకాకుండా నీ యిష్టమొచ్చినట్లు చేసుకుంటావా? నీ స్వేచ్ఛకు అడ్డురాను_అమ్మా! కమలా నీకు కష్టసుఖాలు తెలీవు. ఒంటరి దానవై అన్యజాతివాళ్లతో సుఖంగా సంసారం సాగినన్నాళ్లు బాధలేదుకాని ఏ కొంచెం ఒడిదుడుకులు వచ్చినా సర్వభ్రష్టురాలైపోతావు బాగా ఆలోచించుకో. నాదగ్గర నీకేమీ వాపరికం అక్కరలేదు. నీ మనసు విప్పి చెప్పమ్మా! నే నెప్పుడూ నీ శ్రేయోభిలాషినే'' అని బుజ్జగించి లాలనగా అడిగింది సీతమ్మ.

“మళ్ళీ ఓసారి ఆతణ్ణి అడిగి చూస్తానమ్మా! అసలు ఆతని సంగతి ఇవ్వాళే తేల్చేసుకొంటా!'' అంది జారిపోతోన్న ధైర్యంతో కమల.

“కమలా! నీకా అనుమానం అక్కర్లేదు _ తీగతీస్తే డొంకంతా కదులుంది అని నా ఎదుటకిరాడమ్మా అతను_యిదివరలో వాడు ఓ అమ్మాయిని చెరిచి, ఆమె గర్భంతో యుంటే ఇంక తాను పెళ్ళాడనన్నాడు _

(సశేషం)

PHONE No. 128. ESTD: 1956 GRAMS : "YELGEE".

L G. OFFSET PRINTERS.

(MODERN HOUSE FOR, LITHOGRAPHY)

P. B. No. 114 SIVAKASI (S-1)

మేము మా నిపుణులైన పనివారలచే అందమైన విధముగా అగ్గిపెట్టె, బీడి, మిల్, సోప్, బట్టలు, కాఫి, టీ, సోడా, మిఠాయి, ఫైర్ వర్క్స్, మొదలైనవాటికి కావలసిన లేబిల్సు, పెట్టెలు, ఆఫ్ సెట్ లోనూ, లిథోలోనూ అచ్చువేసి ఇవ్వబడును.

*

మల్టీకలర్ ఫోటో ఆఫ్ సెట్ కేలెండర్లు మా ప్రత్యేకత.

దయచేసి వివరములకు వ్రాయండి.

# మమకారం..!!

* రచన: శ్రీమతి పతానేని శ్రీశైలభ్రమరాంభ *

చివరకా అమ్మాయి అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకొంది. అంతా నేను పూర్తిగా ఎరుగుదును. కళ్ళారా చూచానమ్మా కమలా! అందుకే నువ్వు అతనితో స్నేహంచేస్తున్నావంటే హడలిపోయా. కాని నువ్వు నాదగ్గర ఏమీ రహస్యం దాచకుండా అన్నీ చెప్తావనే ధైర్యంతో ఎందరు యీ విషయాన్ని గురించి నాతో చెప్పినా నేనసలు నమ్మలేకపోయా కమలా! అని చెప్పింది సీతమ్మ.

'అతనంత దుర్మార్గుడా? నిజంగా నేనా? లేకపోతే నా మనస్సు విరిగిపోడానికే అల్లా చెప్తున్నావా? అమ్మా!' అంది సందేహంగా కమల.

'కమలా! నేనింతవరకూ యాభై ఏళ్ళ జీవితంలోనూ, ఎవ్వరిమీద అభాండాలు వెయ్యడంగాని, అపనిందలు మోపడంకాని ఇంతవరకూ ఎరగనమ్మా! నా పగవాళ్ళకు కూడా ప్రతీకారం చేద్దామని నామనస్సులో తలపెట్టలేదు తల్లీ! అతన్నిగురించైనా ఇప్పుడు చెప్ప వచ్చిన అవసరం వచ్చింది కాబట్టి నీకు చెప్పానే కాని లేకపోతే పరనింద చెయ్యాల్సిన పని నాకేముంది కమలా! ఎప్పటికైనా అన్నీ నువ్వే స్వయంగా తెల్సుకోగల్గుతావు.' అనేసి ఊరుకుంది సీతమ్మ.

ఆరోజే కమల మళ్ళీ అతని దగ్గరకెళ్ళి తమ యింటికి రమ్మని బలవంతం చెయ్యడం, ఆతడు రానని నిరాకరించే సరికి వానిని నానా చీవాట్లుపెట్టి దులిపేసింది చెఢామడా. ఆ రాత్రి సీతమ్మను కావలించుకొని బావురుమని ఏడ్చింది కమల – జరిగిందంతా చెప్పుకు వచ్చింది.

ఆ తర్వాత కొద్ది రోజులకే అతన్ని పూర్తిగా మర్చిపోయింది కమల – మరి కొన్నాళ్ళకే గుంటూరులో ఉద్యోగమై వెళ్ళిపోయింది. ఇంట్లో ఎల్లాగైతే తనతో చెప్పుకునేదో అల్లాగే అన్నీ వ్రాసి పంపించేది సీతమ్మకు. ఓరోజు హఠాత్తుగా సీతమ్మ పక్కగుమ్మం ముందు నిల్చుని ఓ యువకుడు సీతమ్మగారిల్లు ఇదేనాండి అని అడుగుతూంటే విని బయట కొచ్చింది తను.

'ఎవరింటికొచ్చారండి?' అని అడిగింది సీతమ్మ – 'సీతమ్మగారి కోసమొచ్చానండి' అని ఆ యువకుడు భిడియపడ్తూ అన్నాడు.

'మీ కెవరు కావాలి?' అంది ఆతనివైపు పరికించి చూస్తూ సీతమ్మ.

'సీతమ్మగారితో మాట్లాడాలండీ' అన్నాడు.

'అయితే మీరు సీతమ్మని ఎరుగరన్నమాట' అంది.

'మాది గుంటూరు. నేను యిక్కడకు వస్తూంటే మిమ్మల్ని ఓసారిచూచి రమ్మని లెక్చరర్ కమలాదేవి చెప్పారు. అందుకని వచ్చా ఆవిడ చెప్పినదాన్నిబట్టి మీరే వారిని ఊహించుకొంటున్నా' అంటూ గుటకలు మ్రింగుతూ చెప్పాడు.

'అవును నాయనా! నేనే సీతమ్మను – మాకమల బాగా ఆరోగ్యంగా యుందా? అక్కడ తిండి' ఇల్లు సదుపాయం బాగుందా? ఇంకా ఏమైనా చెప్పిందా మా చిట్టి తల్లి' – అంటూ కమల మీది వాత్సల్యంతో గబగబా అడిగేసింది సీతమ్మ.

సీతమ్మ అడిగినవాటి కన్నింటికీ నెమ్మదిగా జవాబులిచ్చాడు ఆ యువకుడు. ఇదిగో మీకీ ఉత్తరం యిమ్మన్నారు. అని ఓ చిన్నజాబు ఇచ్చాడు.

పరమసంతోషంతో సీతమ్మ అది విప్పి చదువుకుంది. 'అమ్మకి పాదాభివందనములతో; మా కాలేజీలో లెక్చరర్, మా మిత్రుడు అయిన మూర్తిగారు మనింటికొచ్చి ఒకరోజుంటారు. నేను క్షేమమే. నీ కమల' అని మూడే పంక్తులున్నాయి ముచ్చటగా ఆ జాబులో కమల దగ్గరనుంచి వచ్చిన ప్రతీవారినీ ఆమె విపరీతంగా ఆదరిస్తుంది.

'లోపలికి రా నాయనా! కాళ్ళుకడుక్కో నువ్వేమీ మొహమాట పడక్కర్లేదు' అంది ఆదరంగా.

లోపలికి వచ్చి ఆతడు బూట్లు విప్పి నిల్చున్నాడు. కాళ్ళు కడుక్కోమని అక్కడపెట్టిన చెంబూ నీళ్ళు తీసుకువెళ్ళి కాళ్ళూ ముఖం కడుక్కువచ్చాడు.

కాఫీ, టిఫిన్ తెచ్చిపెట్టింది సీతమ్మ.

'అబ్బే ఇప్పుడే తీసుకువచ్చానండీ, ఇంకేమీవద్దు.' అన్నాడు.

'ఫరవాలేదు కొంచెమే కదూ? తీసుకో' అని ఓ స్టూలుమీద ప్లేటు కప్పుపెట్టి కుర్చీముందుకు పెట్టి కూర్చుని తినమంది సీతమ్మ.

ఆతడు చొక్కా కూడా తీసేసి బనీనుతో కూర్చుని ఎంతో మొహమాట పడ్తూతిన్నాడు.

'ప్రయాణంలో చాలా చికాకుగా ఉంది స్నానం చెయ్యాలండీ!' అన్నాడు సిగ్గుపడ్తూ.

'ఇల్లా దొడ్లోకిరా నాయనా స్నానానికి' అంటూ బిందెనీళ్ళు అక్కడపెట్టి బాత్‌రూమ్ చూపించింది.

ఓ టవల్ భుజంమీద వేసుకు, ఇంకోటవల్ కట్టుకు సోపు బాక్సు చేత్తో పట్టుకు బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు అతడు.

అప్పుడే సాయంత్రం నాలు గొట్టడంతో పాపం! ఆ అబ్బాయి ఎప్పుడనగా భోంచేసాడో అనే తొందరచే కుంపటి అంటించివంట ప్రయత్నం ప్రారంభించింది సీతమ్మ.

అంతలో ఆతడు స్నానంచేసి సావిట్లోకి వచ్చి బట్టలు కట్టుకుని క్రాపుదువ్వుకుని చాలా నీటుగా తయారై అక్కడే గోడనున్న కమల డిగ్రీపుచ్చుకొన్నప్పుడు తీయించుకొన్న ఫొటోని దీక్షగా చూస్తున్నాడు.

ఆతన్ని సీతమ్మకూడా చూస్తూ గుమ్మంలో నిల్చుంది అల్లాగే_అంత పొడుగూ, అంత పొట్టి కాకుండా సమంగా చక్కని చామనఛాయలో, ఎంతో సౌమ్యంగా చక్కగా ఉన్నాడు ఈ అబ్బాయి. ఈతన్ని పెళ్ళాడే అదృష్టం ఏ అమ్మాయి పెట్టిపుట్టిందో? ఉద్యోగం చేస్తున్నాడు కదా ఇంకా పెళ్ళి కాకుండా యుంటుందా? అంటూ మనస్సులో అనుకొంది సీతమ్మ.

అంతలో గుమ్మం దగ్గర అలికిడి అవడంతో వెనక్కు తిరిగి సీతమ్మను చూచి సిగ్గుపడిపోయాడు ఆతడు.

'ఆఫొటో మాకమల యం. యస్. సి. డిగ్రీ పుచ్చుకున్నప్పుడు తీయించుకుంది' అంది సీతమ్మ.

'కమలాదేవిగారు మీ గురించి తర్చుగా చెప్తూంటారు. మీరంటే ఆమెకు ఎంతో గౌరవం. చాలా యిష్టం_మిమ్మల్ని చూచే వరకూ......'

ఎంతో కుతూహలంతో వింటోంది సీతమ్మ_తన కమల తనని గురించి ఏమని చెప్పిందో; తనకేమైనా చెప్పమని చెప్పిందేమో అని.

'మీరే ఆమెకు స్నేహితులు, బంధువులు, సర్వం మీరే అని కమలగారు చెప్పడంచేత, మీరు పెద్దవారనీ ఇంత మంచివారనీ అనుకోలేకపోయా. అందుకే చొరవగా లోపలికిరావడానికి భిడియపడ్డా.

'సీతమ్మ చిరునవ్వు నవ్వి' కూరతరుక్కువస్తా కూర్చో నాయనా!' అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

'మీ కభ్యంతరం లేకపోతే నేనూ అక్కడే కూర్చుంటూ 'నెమ్మదిరా మాట్లాడకోవచ్చు' అన్నాడా యువకుడు.

'అల్లాగే వచ్చి కూర్చో నాయనా! నావంటపూర్తవుతుంది, మాట్లాడుకొంటూ యుండవచ్చు' అంది.

ఆ అబ్బాయి వచ్చి గుమ్మంలో పీటమీద కూర్చున్నాడు. సీతమ్మ బంగాళాదుంపలు తరుక్కుంటూ అతని ముఖంకేసిచూచింది. ఛటుక్కున ఆవిడ మనసులో ఓ ఆలోచన మెరిసింది. ఈ అబ్బాయి మా కమలని పెళ్ళాడితే?...ఏమో ఇంత ఇదైన వాడు ఎంత కట్నం అడుగుతాడో తనని_అయినా కమలకి కట్నము యివ్వడమెందు? పెద్ద లెక్చరర్ చేస్తోంది. అందమైనది, ఆ చిలికిపిల్ల, ఆ చిన్నారి పెదిమెలు, ఆ కోలముఖం, ఆ మంచితనం, మా కమలను ఎగిరిగంతేసి చేసుకుంటారు.

అయినా యీ అబ్బాయిని చూసింది మొదలు కమలకు భర్తగా అయితే బాగుండునని పదేపదే తను అను

(తరువాయి 25వ పేజీలో)

(4వ పేజీ తరువాయి)

వడేటట్టు చేస్తాడు. నీవు దాపరికంలేకుండా ప్రతిదీ సూటిగా మాట్లాడే మనిషివే అనుకో నీ నడవడిక బాగున్నదనుకో. నీ స్నేహితులు ప్రతిదీ దాపరికంతో మాట్లాడే అలవాటున్న వాళ్లయినట్టయితే, వాళ్ళను నీవు నీ ప్రభావం పడేటట్టు చేసి, కల్లబొల్లి మాటలు చెప్పకుండా చెయ్యాలి. వాళ్ళ బలహీనతలను హాస్యంచేసి, వాళ్లు వాటిని—ఆ లోపాలను తెలుసుకునేటట్టు చెయ్యాలి. అబద్ధాలవల్ల రాగల ముప్పును వాళ్లు అర్థం చేసుకునేటట్టు చెయ్యాలి. ఇది కాలక్రమేణా రావలసిన మార్పు (ఎవరి నడతనైనా ఎవ్వరూ తృటిలో మార్చలేరు)—అది. లోపాలు తెలుసుకున్న పిల్లవాడు, క్రమంగా వాటిని పోగొట్టుకుంటాడు.

మంచి నడవడికను ఇట్లా కలిసికట్టుగా అలవరచుకోవాలి. నిజంగా మంచి పిల్లవాడు కావటానికి ఏంచెయ్యాలో, ఆ విషయాన్ని గురించి మేమింకా చెప్పనేలేదు, దానిని ఒకటి రెండు మాటల్లో చెప్పాలంటే వీలుపడేది కాదు.

(6వ పేజీ తరువాయి)

కొంటోంది. ఇంక మనస్సులో వుండబట్టలేక 'నీకు పెళ్లియిందా' అంది సీతమ్మ.

'ఇంకా కాలేదండి' అని ముసిముసి నవ్వులు నవ్వుకొంటున్నాడు తనలో.

'నువ్వూ యం. యస్. సి. ఏనా చదువుత' అనడిగింది సీతమ్మ.

'మొదట బి. యస్ - సి - బి. యి. డి. చదివి హైస్కూల్లో రెండేళ్లు పనిచేసి తర్వాత యం-యస్-సి. చదివి లెక్చరర్ గా యుంటున్నా' అన్నాడు వివరంగా చెప్తూ.

'అల్లాగా?' అంటూ శ్రద్ధగా వింటోంది సీతమ్మ.

'కమలగార్కి మీరంటే చాలా అభిమానం, గౌరవం, మీరు తప్ప తనకెవ్వరూ లేరంటారు' అని మళ్లీ అన్నాడు.

సీతమ్మ నవ్వి ఊరుకుంది.

మెల్లిగా అతడు ఆ మాటా ఈమాటా చెప్పి కమల చిన్నతనం గురించి అడిగాడు సీతమ్మను.

ఇంక తన కమలను గురించి చెప్తూండే సీతమ్మగారికి నిద్రాహారము లక్కరలేదు. కమలను గురించి చెప్పుకుంటేనే ఆవిడకు కడుపునిండిపోతుంది. పులిస్టాప్, కామా, అనేది లేకుండా తన కమలను గురించి, ఆమె చదువు, చిన్నతనం, ఆమె సద్గుణాలు వర్ణించి, వర్ణించి తన్మయత్వంగా చెప్పుకుపోతోంది. అతడు ఎంతో శ్రద్ధగా వింటూ కూర్చున్నాడు. ఈవిధంగా చదువు పూర్తి చేసింది కమల అని చెప్పడంతో సీతమ్మగారి వాక్ప్రవాహం ఆగింది.

'మరి మీ కమలాదేవిగారికి పెళ్ళి చేసుకుందామనే తలంపు లేదా?' అన్నాడు చిరునవ్వుతో.

'ఏమిటో నాయనా! అదోసత్యకాలపుపిల్ల. చదువు మీద తప్ప ఇంకే ధ్యాసాలేదు - వెర్రితల్లి ఒక్కర్తీవుంటోంది. ఈ ఏడు ఆ అక్షింతలు పడితే బాగుండును. నాయనా! మీరే శాఖ? మీ అన్నదమ్ములు ఎకతమంది? అమ్మా నాన్నా యున్నారా? మీకు పెళ్ళి సంబంధం మేనరికంయుందా? కట్నాలేం పుచ్చుకంటారు?' ఇల్లాంటి వివరాలన్నీ అడిగింది సీతమ్మ అతణ్ణి.

ఆ అబ్బాయికి మొదట్లోయున్న సిగ్గు, సంకోచం తగ్గి ధారాళంగా మాటాడం ప్రారంభించాడు. ఆ అబ్బాయికూడా తన చదువు, తనలోయుండే సంస్కారం, తన సంసార పద్ధతి. తన ఉద్యోగం, ఉనికి, అన్నీ వివరంగా చెప్పాడు. చాలా సీరియస్ గా ముఖంపెట్టి ఎంతో గొప్ప విషయాన్ని మాట్లాడే పక్కిలో ప్రారంభించి చిన్నమాటతో తుస్సు మనిపిస్తూ సీతమ్మగారిచే తపకపకా నవ్వించాడు. అతి స్వల్పవిషయానికి కూడా ఇల్లాంటి కుర్రాడు తనింట్లో మసులుతూ, తన కమలకిభర్త యితే బాగుండునని ఎంతో మురిసిపోయిందే కాని; ఆ మాట తపీమని అడగడానికి ధైర్యమూలేదు; కమలతో చెప్పందే అనడానికి ఇష్టమూలేదు సీతమ్మకు.

మర్నాడు ప్రొద్దున్నే భోజనంచేసి వెళ్లమనడంతో సరేనని ఆగాడు అతడు. ఆరాత్రి మర్నాడు కూడా ఎన్నో విషయాలు, వివరాలు అన్నీ అడిగి తెల్సుకుంది సీతమ్మ. అతడు వెళ్ళిపోతోంటే అతనితో, ఎప్పుడైనా ఈ వైపుకు వచ్చినప్పుడు తప్పకుండా మాయింటికి వస్తూండండి. మా కమలను మాత్రం అర్జంటుగా నే రమ్మనని చెప్పండి. నాలురోజులు శెలవుతీసుకునైనా సరే వెంటనే వచ్చెయ్యమనండి, ఒక్కమాట చెప్పాలి' అంది సీతమ్మ.

'ఇంత ఆదరించిన మీయింటికిరాకుండా యుంటానా మళ్ళా. మీ అంగీకారమైతే మీరు వద్దనే వరకూ వస్తూనే యుంటా. ఆ అన్నట్లు మీ కమల కేదైనా ఉత్తరమిస్తారా?' అన్నారు కొంచెంబుర్రగా అతడు.

'అబ్బే! మా కమలతో ముఖాముఖీని చెప్పాలికాని ఉత్తరం కుదరదు. త్వరగా వచ్చెయ్యమని చెప్పేయ్. వీలుంటే నువ్వుకూడా ఓసారి రానాయనా!' అంది రెట్టించిన స్వరంతో.

అతడు వెళ్ళిపోయాక అతనిమాటల్ని, అతని నడవడికని తల్చుకుని ఎప్పుడు కమలతో చెప్పేద్దామా? అని మనస్సులో చాలా కలవరపడిపోతోంది సీతమ్మ.

సాయంత్రానికే కమలకూడా వచ్చేసింది. కమలను కళ్ళారా చూచేసరికే ఉప్పొంగిపోయింది సీతమ్మ. తన మెదడులో అప్పుడు వెయ్యారెళ్ళు పరుగెడ్తున్నట్లు అనిపించింది. ఇంతలో కమల ఎల్లా వచ్చింది? ఎందుకు వచ్చింది? అనుకొంటూనే 'రా' కమలా! ఎప్పుడు బయల్దేరావు?' అంది సీతమ్మ.

'నాల్గురోజులు శెలవుపెట్టి వచ్చానమ్మా-నిన్ను చూడాలనిపిస్తే' అని సీతమ్మను గట్టిగా కావిలించుకుని అల్లాగే నిల్చుంది అమాయికంగా కమల.

'రా! లోపలికి రాతల్లీ! ఆదేవుడుకూడా అనుగ్రహించినట్లే నిన్ను ఇక్కడికి తీసుకువచ్చాడు. నీతో బోల్డు చెప్పాలి' అని చెయ్యిపట్టుకు లోపలికి తీసుకెళ్ళింది కమలని.

(సశేషం)